## క్లుప్తంగా

### నిరాశ్రయుల కేంద్రంలో వైద్య శిబిరం



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ మానస

విశాఖ విద్య: బుచ్చిరాజుపాలెంలోని పట్టణ నిరాశ్రయుల కేంద్రంలో ఆదివారం ఉదయం రాబిన్ హుడ్ ఆర్మీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. నిరాశ్రయులకు బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. మెడికల్ అధికారి ఎన్. మానస వృద్ధుల ఆరోగ్యస్థితిగతులను అడిగి తెలుసుకొని అవసరమైన మందులు సిఫార్సు చేశారు. ఎటువంటి ఆరోగ్య పరమైన సమస్యలు ఎదురైనా వెంటనే సమీప ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రాబిన్ హుడ్ ఆర్మీ సభ్యులు నిరాశ్రయులకు తినుబండారాలతో పాటు టవల్స్ అందజేశారు. కార్యక్రమంలో రాబిన్ హుడ్ ఆర్మీ సభ్యులు డాక్టర్ ఉదయ్, డి. సంజీవ కుమార్, ప్రసాద్, రవికాంత్, దివ్య, శంకర్, స్వాతి, ప్రదీప్, మమతా చారిటబుల్ ట్రస్ట్ అధినేత మమత పాల్గొన్నారు.

### వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి



రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

విశాఖ విద్య: ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజానీకం అంతా అప్రమత్తంగా ఉండాలని నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కోరారు. మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నీటిమట్టం పెరగడంతో ఆదివారం రిజర్వాయర్ పరిసర ప్రాంతాలను శ్రీధర్ పరిశీలించారు. రిజర్వాయర్ నీటిమట్టం వివరాలు అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. లోతట్టు, కొండవాలు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని కోరారు.

### శీరం సేవలు చిరస్మరణీయం

మల్కాపురం : పారిశ్రామిక ప్రాంతంలో టీడీపీ బలోపేతానికి శీరం పైడిరాజు చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. 58వ వార్డు మాజీ కార్పొరేటర్ శీరం పైడిరాజు వర్ధంతి శ్రీహరిపురం వద్ద ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో నక్క లక్ష్మణరావు, రామ్మోహన్‌నాయుడు, ఉరుకూటి కాశీ యాదవ్, పాతబత్తుల శ్రీను పాల్గొన్నారు.

### కాట్రగడ్డ భారతికి సురా పురస్కారం



భారతికి పురస్కారం ప్రదానం చేస్తున్న కరుణరాజు, తదితరులు

సీతంపేట : ప్రముఖ సంఘ సేవకుడు, హేతువాది పేరిచర్ల సుబ్బరాజు పేరిట నెలకొల్పిన సురా సాహిత్య సామాజిక సేవా పురస్కారాల ప్రదానం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించారు. సావిత్రీ భాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురికి పురస్కారాలు అందజేశారు. సురా సాహిత్య సామాజిక సేవా పురస్కారం 2024 సంవత్సరానికి తెలంగాణ రాష్ట్ర శరీర అవయవ దాతల సంఘం అధ్యక్షురాలు కాట్రగడ్డ భారతికి స్టీల్‌ప్లాంట్ సీవీవో ఎస్.కరుణరాజు చేతుల మీదుగా అందజేశారు. అలాగే చరిత్రకారుడు సయ్యద్ నజీర్ అహ్మద్‌కు(2019), ప్రజా వాగ్గేయకారుడు దప్పు రమేష్‌కు(2020), సాహిత్య సామాజికవేత్త అనిశెట్టి రజితకు(2021), సంఘ సేవకురాలు పి.రాజ్యలక్ష్మికి(2022), రక్తదాన ఉద్యమకారుడు వి.వినోద్‌బాలుకు (2023) పురస్కారాలు అందజేశారు.

# ఏక దంతాయ.. విభిన్న రూపాయ

- కొలువుదీరిన గణనాథులు



నగరాలవీధిలో శ్రీవేంకటేశ్వరస్వామి రూపంలో..



గొల్లకంచరపాలెం నేతాజీ క్లబ్ వద్ద పూరీ జగన్నాథ స్వామి రూపంలో ఏర్పాటు చేసిన గణపతి



మల్కాపురం గొల్లవీధి వద్ద ఐదు తలల సర్పంపై..



మర్రిపాలెం వుడా లేఅవుట్‌లో..



గవర వీధిలో ఆకట్టుకుంటున్న 30 అడుగుల వినాయకుడు



మల్కాపురం తెలుకుల వీధి వద్ద ఆంజనేయస్వామి రూపంలో గణనాథుడు



40వ వార్డు ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ నాగేశ్వరరావు, తదితరులు



63వ వార్డులో గణపతిని దర్శించుకుంటున్న భక్తులు, కార్పొరేటర్ చిన్నా



జయప్రకాష్‌నగర్‌లో ఆకట్టుకుంటున్న వినాయక మండపం

మల్కాపురం:వినాయక చవితి పర్వదినాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. వాడవాడలా పందిళ్లు వేసి గణపతి ప్రతిమలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. ఏకదంతుడు విభిన్న రూపాల్లో కొలువుతీరాడు. దీంతో ఏ వీధిలో చూసిన ఆధ్యాత్మిక సందడి నెలకొంది. జీవీఎంసీ 59వ వార్డు నక్కవానిపాలెం వద్ద లంబోధర చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సుమారు 75 అడుగుల ఎత్తులో 20 టన్నుల బెల్లంతో నెలకొల్పిన గణనాథుడి దర్శించుకోవడానికి శని,ఆదివారాలో వేలాది మంది భక్తులు తరలివచ్చారు. 61వ వార్డు మల్కాపురం గొల్లవీధి వద్ద యాదవ్ యూత్ ఆధ్వర్యంలో , తెలుకుల వీధిలో స్థానిక యూవత ఆధ్వర్యంలో, నగరాలవీధి వద్ద నగరాల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక బొమ్మలు విభిన్నంగా ఉన్నాయి.

**గణనాథులను దర్శించుకున్న ప్రముఖులు**

నక్కవానిపాలెం వద్ద భారీ బెల్లం వినాయకుడిని ఎమ్మెల్యే పి.గణబాబు దంపతులు దర్శించుకున్నారు.అలాగే బీజేపీ నాయకుడు ఎం.ప్రకాష్‌తో పాటు పలు వార్డుల కార్పొరేటర్లు దర్శించుకున్నారు. మల్కాపురం వద్ద అల్లరి యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథుడుని కార్పొరేటర్ పల్లా శ్రీనివాస్‌యాదవ్,61వ వార్డు టీడీపీ అధ్యక్షుడు మజ్జి సోమేష్ , యాదవ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని తెలుగు యువత నాయకుడు ఉరుకూటి కాశీయాదవ్ తదితరులు దర్శించుకుని పూజలు చేశారు.

**జోరువానలోనూ ఉత్సవాల సందడి**

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు శాంతినగర్, కరాస తదితర ప్రాంతాల్లో ప్రత్యేక మండపాల్లో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహాలు ఆకట్టుకున్నాయి. శాంతినగర్‌లో జియ్యాని యూత్ ఆధ్వర్యంలో, మర్రిపాలెం వుడా లే అవుట్ కాలనీలోని వరసిద్ధి వినాయక ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు వేడుకగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే గణబాబు స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ కమిటీ చైర్మన్ సూర్యనారాయణ, వైస్ చైర్మన్ ప్రసాద్ రెడ్డి, సెక్రటరీ ఐ.వి .శంకరరావు , జాయింట్ సెక్రెటరీ డాక్టర్ శిరీష, శివప్రసాద్, ట్రెజరర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

- 90వ వార్డు బుచ్చిరాజుపాలెం, కాకాని నగర్, విమాన్ నగర్, లక్ష్మీనగర్ తదితర కాలనీల్లో ప్రత్యేకంగా ఏర్పాటు జోరు వాన కురుస్తున్నప్పటికీ ఉత్సవాల సందడి కనిపించింది.

**పరవశించిన భక్తజనం**

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు పరిధిలోని ఏకేసీకాలనీ, షిప్‌యార్డ్‌కాలనీ, రాజీవ్‌కాలనీ, సింథియా న్యూకాలనీ వంటి ప్రాంతాల్లో నాయక చవితి ఉత్సవాలను వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు తొలిపూజ చేసి ప్రారంభించారు.

- జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురం, దుర్గానగర్, గుడివాడఅప్పన్నకాలనీ, అల్లూరిసీతారామరాజుకాలనీ, ఎన్టీఆర్‌కాలనీ, టీడీపీ కాలనీ, అంబేడ్కర్‌కాలనీ, ప్రకాష్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రి మహోత్సవాల్లో వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భీశెట్టి గణేష్‌తో పాటు నాయకులు పాల్గొన్నారు.
- జీవీఎంసీ 63వ వార్డు క్రాంతినగర్, చింతల్లోవ, జైఆంధ్రాకాలనీ, వాడవీధి, కాకరలోవ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణపతి మండపాలను వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో గూడెల కృష్ణ, పుక్కల కృష్ణ ,పోలిరాజు, ధర్మ, సన్యాసిరావు, నరేష్ పాల్గొన్నారు.

గోపాలపట్నం : వినాయక నవరాత్రులు సందర్భంగా జీవీఎంసీ 91, 92, 89వ వార్డుల్లో ఏర్పాటు చేసిన మండపాలు ఆకట్టుకున్నాయి. స్థానిక గవర వీధిలో గౌరి సేవా సంఘం ఆధ్వర్యంలో 30 అడుగుల భారీ వినాయక విగ్రహం చూపరులను ఆకట్టుకుంటోంది. ఈ నెల 11న పంచామృతాభిషేకాలు, 13న సామూహిక కంకుమార్చన, 21న గరిక పూజ, 25న లక్ష్మీగణపతి హోమం, 26న గణపతి కల్యాణ మహోత్సవం, 27న లడ్డూ అర్చన, అదే రోజు మధ్యాహ్నం అన్నసంతర్పణ, 29న అనుపోత్సవం నిర్వహిస్తామని తెలిపారు.

- జయప్రకాష్‌నగర్‌లో యువకులు ఏర్పాటు చేసిన వినాయక మండపం చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఉదయం నుంచి వినాయకునికి విశేష పూజలు చేశారు.
- గోపాలపట్నం ప్రధాన రహదారిలోని రామాలయం వద్ద వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో విశేష పూజలు నిర్వహించారు.

కంచరపాలెం : జీవీఎంసీ 56వ వార్డు పరిధి కంచరపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్‌లో గల గొల్లకంచరపాలెం, తోటవీధి, దుర్గానగర్, గోకుల్‌నగర్, గౌరీనగర్, తుమ్మడపాలెం, ఆశవానిపాలెం, 104 ఏరియా, శ్యామ్‌నగర్, దుర్గాపురం, సాకేతికపురం ప్రాంతాల్లో గణపతి నవరాత్రులు శనివారం ఘనంగా ప్రారంభించారు. గొల్లకంచరపాలెం నేతాజీ గ్రంథాలయం వద్ద పూరీ జగన్నాథ్ రూపంలో ఏర్పాటు చేసిన గణనాథుడు భక్తులను ఆకట్టుకున్నారు. ఆయా వార్డుల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు గణనాథులను దర్శించుకుని పూజలు చేశారు. ఆదివారం కురిసిన వర్షాలకు వినాయక మండపాలు పూర్తిగా తడిసి ముద్దయ్యాయి.



గోపాలపట్నం రైల్వేస్టేషన్ రోడ్డులో...



90వార్డు ఏపీఎస్‌ఈబీ కాలనీలో కొలువుదీరిన గణనాథ



మర్రిపాలెం వుడా లే అవుట్‌లో చిన్నారుల నృత్య ప్రదర్శన



62వ వార్డులో గణపతి స్వామివారి దర్శించుకుంటున్న కార్పొరేటర్ లక్ష్మణరావు



కంచరపాలెంలో వినాయక మండపంలో భక్తులు

# వాన.. హైరానా

- తడిసిముద్దయిన'పశ్చిమ'
- స్తంభించిన జనజీవనం
- హెచ్చరికల నేపథ్యంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు



వర్షం అయినా తప్పదు ప్రయాణం..



వర్షంలో మార్కెట్‌లో వ్యర్థాలను తొలగిస్తున్న వ్యాపారి



62వ వార్డు కొండవాలు ప్రాంతాల్లో పర్యటిస్తున్న కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు



ముద్దయిన సేవా మార్గం

మల్కాపురం:శనివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి రహదారులు జలమయం అయ్యాయి. వర్షాల కారణంగా జనజీవనం స్తంభించిపోయింది. తోపుడు బళ్ల వ్యాపారాలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. చాలా మంది దుకాణాలు తీయలేదు. పారిశ్రామిక ప్రాంతంలో పెద్ద కాలువలు,గెడ్డలు పొంగిప్రవహిస్తున్నాయి. కూరగాయల వ్యాపారాలు వర్షం కారణంగా అంతగా సాగకపోవడంతో వారు నిరాసకు గురయ్యారు. మరో వైపు ఏకధాటిగా వర్షం కురవడంతో అధికారులు అప్రమత్తమయ్యారు.

**ములగాడలో కంట్రోల్ రూమ్**

మల్కాపురం: భారీ వర్షాల నేపథ్యంలో ములగాడ మండల ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని ములగాడ తహసీల్దార్ తారకేశ్వరి తెలిపారు. మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో ములగాడ తహసీల్దార్ కార్యాలయం వద్ద కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని ఆమె వివరించారు. సోమవారం ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు కంట్రోల్ రూమ్ వద్ద వీఆర్వోలు జి.లక్ష్మి, కె.జ్యోగి,జె.పరమేష్ అందుబాటులో ఉంటారని చెప్పారు. ప్రజలకు వర్షం వల్ల ఏమైనా ఇబ్బందులు ఉంటే 9177862431,7382290484, 7781066893 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెంలో రహదారులు జలమయమయ్యాయి. కొత్తపాలెం నుంచి నరవ వెళ్లే రహదారిలో మోకాలి లోతు నీరు ప్రవహించింది. వర్షం కొనసాగితే యల్లపువానిపాలెం ఎస్సీ కాలనీ, సాయి గణపతినగర్ ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**కొండవాలు ప్రాంతాల్లో పరిశీలన**

సింథియా : జీవీఎంసీ 62వ వార్డులో గల కొండవాలు ప్రాంతాల్లో కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు విస్తృతంగా పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున కొండలపై నివసిస్తున్న వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. త్రినాథపురంలోని కొండవాలు ప్రాంతంలో నివసిస్తున్న గిరిడా సూరిబాబు, దుర్గారావు నివాసాలపై కొండచరియలు విరిగిపడి రక్షణగోడ కూలిపోయింది. దీంతో హుటాహుటిన చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అధికారులకు తెలియజేసి వెంటనే రక్షణ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.





కొత్తపాలెం నుంచి నరవ వెళ్లే రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు

# విరిగిపడిన కొండచరియలు



కొండచరియలు విరిగి పడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్నడిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్



కొండచరియలు విరిగి పడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: గోపాలపట్నం రామకృష్ణానగర్‌లో బజాజ్ ఎలక్ట్రానిక్స్ దుకాణం పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో కొండచరియలు ఆదివారం మధ్యాహ్నం విరిగిపడ్డాయి. ఎగువన ఉన్న రోడ్డులో కొంత భాగంతో పాటు దిగువన ఉన్న రిటర్నింగ్ వాల్ సైతం పునాదులతో సహ జారి పడిపోయింది. కొండచరియలు విరిగిపడిన ప్రాంతంలోని సుమారు 20 కుటుంబాలను లక్ష్మీనగర్ ప్రాథమిక పాఠశాలలో షెల్టర్ ఇచ్చారు. ప్రమాద ప్రాంతాన్ని ఎమ్మెల్యే గణబాబు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ సందర్శించారు. ఇక్కడి ఇళ్లలో ఉన్న వారితో పాటు ప్రమాదకరంగా ఉన్న ఇళ్లలో ఉన్నవారిని సైతం ఖాళీ చేయించాలని సూచించారు. జీవీఎంసీ అధికారులు, పోలీస్ అధికారులు సఘటనా స్థలానికి చేరుకుని తక్షణ చర్యలు చేపట్టారు.

**కంచరపాలెంలో కూలిన రక్షణగోడ**

కంచరపాలెం : జీవీఎంసీ 56వ వార్డు గొల్లకంచరపాలెం, గవర కంచరపాలెం రైల్వేట్రాక్‌కు ఆనుకుని ఉన్న రక్షణ గోడలు భారీ వర్షాలకు కూలిపోయాయి. గవర కంచరపాలెంలో ఉన్న రైల్వే రక్షణ గోడ ఆదివారం మధ్యాహ్నం కూలే సమయంలో విద్యుత్ స్తంభాలపై పడడంతో ఓ స్తంభం ఒరిగిపోయింది. ఆ స్తంభం వినాయకచవితి ఉత్సవాల కోసం ఏర్పాటు చేసిన పందిరిపై పడింది. ఆ సమయంలో పందిరిలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు. జోన్ – 2 ఏఈ వీర్రాజు పర్యవేక్షణలో విద్యుత్ సిబ్బంది స్తంభాన్ని తొలగించారు. గోడకు ఆనుకుని ఉన్న వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. గొల్లకంచరపాలెం రైల్వేట్రాక్‌లో ఉన్న రక్షణ గోడ ఒక్కసారిగా ప్రధాన గెడ్డలో కూలిపోయింది. గోడ రాళ్లు గెడ్డలో పడడంతో వర్షం నీటి ప్రవాహానికి అడ్డంగా మారింది. దీంతో వరద నీరు రోడ్లపైకి చేరింది. జోన్ – 5 ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్ ఆదేశాలతో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ జె.రమేష్ పర్యవేక్షణలో జేసీబీ సాయంతో గెడ్డలోని రాళ్లను తొలగించారు.

**విరిగి పడుతున్న కొండచరియలు**

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు క్రాంతినగర్ వద్ద కొండచరియలు విరిగి కింద ఉన్న ఇళ్లపై పడుతున్నాయి. దీంతో ఆదివారంలో వీఆర్వో రామకృష్ణతో కలిసి పర్యటించిన వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా పర్యటించారు. ప్రజలకు నష్టం కలుగకుండా తగిన ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు.



గవర కంచరపాలెంలో కూలిన రైల్వే రక్షణగోడ

### శిష్టకరణ సంఘం బలోపేతానికి కృషి

డాబాగార్డెన్స్ : ఆంధ్రప్రదేశ్ శిష్టకరణ సంఘాన్ని మరింత బలోపేతం చేస్తానని ఏపీ శిష్టకరణ సంఘం అధ్యక్షుడు పోలిమహంతి ఉమామహేశ్వరరావు తెలిపారు. ప్రేమసమాజం సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన ఏపీ శిష్టకరణ సంఘం కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. జాబితా తయారు చేసి ఎన్నికలు నిర్వహించాలని తీర్మానించామన్నారు.

### విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న మినీ వ్యాన్

మర్రిపాలెం : కంచరపాలెం మెట్టు నుంచి జ్ఞానాపురం కాన్వెంట్ జంక్షన్ వైపుగా వెళ్తున్న మినీ వ్యాన్ ఒకటి అదుపుతప్పి ఆదివారం ఉదయం కంచరపాలెం వంతెనపై ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. అయితే ప్రమాద సమయంలో ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఘటనా స్థలానికి కంచరపాలెం ట్రాఫిక్ సీఐ దాశరథి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా క్రమబద్ధీకరించారు.

### శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం

సీతమ్మధార : శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని ద్వారకా పోలీస్ స్టేషన్ సీఐ డి.వెంకటరమణ స్పష్టం చేశారు. ఆదివారం ఆయన ద్వారకా స్టేషన్ సీఐగా బాధ్యతలు చేపట్టాక మీడియాతో మాట్లాడారు. మాదక ద్రవ్యాలు సరఫరా, గంజాయి అక్రమ రవాణాదారులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. రౌడీషీటర్లు హద్దు మీరితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఆడపిల్లలను ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆకతాయిలపై ప్రత్యేక నిఘా ఉంటుందని, కళాశాలల వద్ద సాయంత్రం బ్లూకోట్స్ పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పని చేస్తామన్నారు. ఎస్ఐ శ్రీనుతోపాటు ఏఎస్ఐలు, హెచ్‌సీలు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పరిచయం చేసుకున్నారు. ప్రస్తుత సీఐ డి.వెంకటరమణకు ఇక్కడ విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన సీఐ ఎస్.రమేష్ స్వాగతం పలికి మొక్క అందించారు. అనంతరం రమేష్‌ను సత్కరించారు.